ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





దిష్టి తోరణం కింద బెల్లం సాకం ఆరబోస్తున్న పూజారులు

మండమెలిగె.. మది మురిసే..

మేడారంలో ఘనంగా మినీ జాతర వేడుకలు

భక్తజన సందోహంతో మేడారం కిటకిటలాడింది. మినీ జాతర ప్రారంభం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండమెలిగె పండుగ సందర్భంగా పూజారులు మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టితోరణాలు కట్టారు. అందులో కోడిపిల్ల, సొరకాయను కట్టారు. ఈ సందర్భంగా భక్తులు పోటెత్తారు. సమ్మక్క - సారలమ్మలను, గోవిందరాజులు, పగిడిద్దరాజులను తాకేందుకు పోటీపడ్డారు. తొలుత జంపన్నవాగులో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు ఆచరించి.. ఆపై ఎత్తు బంగారంతో పాటు పసుపు, కుంకుమ, చీర సారెలను అమ్మవార్లకు సమర్పించారు. జంతు బలులు ఇచ్చి అడవిలో విందారగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కోలాహలం కనిపించింది. సుమారు 2.5 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

- తాడ్వాయి (ఆంధ్రజ్యోతి)



జంపన్నవాగులో పుణ్యస్నానం చేస్తున్న యువతి

- అంతర్గత పూజలు చేసిన పూజారులు
- కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం
- సుమారు 2.5 లక్షల మంది భక్తుల రాక
- సందడిగా మారిన వనదేవతల సన్నిధి

7



మేడారంలోని సమ్మక్క ఆలయం నుంచి పూజా సామగ్రిని గద్దెల వద్దకు జాగారానికి తీసుకెళుతున్న ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య, ఇతర పూజారులు



అమ్మవార్లకు ఎత్తు బంగారం తీసుకెళుతున్న భక్తురాలు

హార్డ్‌వేర్ దుకాణంలో అగ్నిప్రమాదం

ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు

రూ. 20 లక్షలకు పైగా నష్టం





మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాకేంద్రంలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ రోడ్డులో గల జైభవాని ఎలక్ట్రికల్స్ హార్డ్‌వేర్, సానిటరీ దుకాణంలో ప్రమాదశాత్తు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. రోజు మాదిరిగానే రాత్రి 10.30 గంటలకు షాపు యజమాని, సిబ్బంది దుకాణాన్ని మూసి వేశారు. షాపు మూసివేసిన కొద్దిసేపటికే మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. దుకాణ యజమాని దీపారామ్, స్థానికులు ఇచ్చిన సమాచారంలో సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున చెలరేగి భారీ స్థాయిలో పొగలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది మంటలను త్వరగా అదుపులోకి తెచ్చేందుకు గానూ రసాయనం(ఫోమ్) కలిపిన నీటిని చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు గంట పాటు శ్రమించిన తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది, పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లుగా తెలుస్తోంది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమా?, దేవుడి ముందు పెట్టిన దీపం కారణమా? అన్నది తెలియాల్సి ఉంది. కాగా.. ఘటనా స్థలాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్ పరిశీలించారు. అగ్నిప్రమాద ఘటనలో దుకాణ యజమాని దీపారామ్ కుటుంబానికి ప్రాణాపాయం తప్పింది.

తండ్రి మరణం.. కూతురికి పరీక్ష

బచ్చన్నపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా కాపాడిన తండ్రి మృతిచెందాడనే బాధ ఓ వైపు.. పరీక్ష కాలం మరో వైపు. ఇలాంటి పరిస్థితి పగవాడికి కూడా రాకూడదనే ఆవేదన. అలాంటి తరుణంలో తండ్రి చనిపోయాడనే బాధను పంటి బిగువున భరిస్తూ పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఆ అమ్మాయి ఎంబీబీఎస్ పరీక్షకు హాజరైంది. ఈ విషాదకర ఘటన జిల్లాలోని బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామంలో చోటు చేసుకుంది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోల భిక్షపతి మహబూబాద్ జిల్లా పెద్ద వంగర మండలం గండ్ల కుంట పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఆకస్మికంగా అస్వస్థతకు గురై మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లుండగా చిన్న కూతురు శృతి సూర్యాపేటలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతోంది. బుధవారం వార్షిక పరీక్ష ఉండడంతో, తండ్రి మరణవార్త తెలిసి పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొంది. కడసారి చూపుల కోసం ఉదయం జరగాల్సిన అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, గ్రామ స్థులు సాయంత్రానికి వాయిదా వేశారు. అంత్యక్రి యల్లో పెద్ద వంగర ఎంఈవో బుదారపు శ్రీనివాస్, హెచ్‌ఎం మంజుల. ఉపాధ్యాయులు విజయ, ప్రభు చరణ్, యాకూబ్‌పాషా, వేణుగోపాల్, కవిరాజ్‌లు పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున రూ. 30 వేలు, స్టాఫ్ రూ.5 వేలు అంత్యక్రియల కోసం అందించారు.



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న శృతి

గ్రామదేవతలకు ఎమ్మెల్యే కడియం పూజలు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మడపల్లి(జి)లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం రాత్రి గ్రామదేవతలను దర్శించుకున్నారు. గ్రామంలో దుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆయన తొలుత గ్రామ చివర గల దుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవిని, అనంతరం గ్రామ సెంటర్‌లో గల బొడ్రాయి దేవతను సందర్శించి పూజలను నిర్వహించారు. ప్రజలను సల్లంగా చూడాలంటూ శ్రీహరి గ్రామదేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పు కట్టలేదని..

ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన బ్యాంకు అధికారులు

కొడకండ్ల ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో తీసుకున్న అప్పు కట్టడంలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన సంఘటన కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులలో 2 గ్రూపులు తండా మంజుల, మద్దెబోయిన ప్రేమలతలకు పాడిగేదెల కోసం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని డీసీసీబీ బ్యాంకు రూ. 8లక్షల 72 వేలు రుణం అక్టోబరు 2021లో ఇచ్చింది. గ్రూపునకు ఐదుగురు చొప్పున రెండు గ్రూపుల్లో మొత్తం 10 మంది తలా ఒక పాడిగేదె కొనుగోలు చేశారు. మహిళల ఎదుగుదల కోసం గ్రూపుల వారీగా మహిళలకు రుణాలు అందించారు. అయితే కొంత అప్పు కట్టినా రెండు గ్రూపులు కలిపి మొత్తం 7 లక్షల బాకీ కట్టలేదు. నిజానికి 2023లో ఈ రుణం వాయిదాలు పూర్తి కావాల్సి ఉంది. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు 2023 అక్టోబరులో లీగల్ నోటీసులు పంపారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం లబ్ధిదారుల ఇంటికి బ్యాంకు సిబ్బంది లీగల్ నోటీసులు ఇవ్వడానికి వెళ్లి గట్టిగా అడగడంతో 3 లక్షలు చెల్లించారు. రెండు రోజుల్లో మొత్తం చెల్లిస్తామన్నా వినకుండా తమ ఇంటి గేట్లు తీసుకెళ్ళారని మద్దెబోయిన ప్రేమలత ఆరోపిస్తుండగా వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతోనే తాము లీగల్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. వారంతట వారే తమ గేట్లు తీసుకెళ్లండని అన్నారని డీసీసీ కొడకండ్ల బ్రాంచి మేనేజర్ కళ్యాణి తెలిపారు.



ఏడునూతులలో ఇంటిగేట్లు తీసుకెళ్తున్న డీసీసీబీ బ్యాంకు సిబ్బంది

సహకార ఎన్నికలపై సందిగ్ధం..!

- రేపటితో ముగియనున్న పాలక వర్గాల పదవీ కాలం
- ప్రత్యేక పాలనా..? లేక పదవీకాలం పొడిగింపా..?
- ఎన్నికలపై రాని స్పష్టత
- కొనసాగుతున్న సభ్యత్వాల ప్రక్షాలన
- పెండింగ్‌లో బ్యాంకుల విస్తరణ
- జిల్లాలో 14 సహకార సంఘాలు
- 40 వేల మంది సభ్యులు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) రైతులకు సాగు పరంగా అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలను అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నాయి. ఈ సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తున్నారు. ప్రతి ఐదేళ్లకో సారి ఈ సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తూ పాలక వర్గాలను ఎన్నుకుంటున్నారు. ప్రస్తుత సొసైటీల పాలక వర్గాల పదవీ కాలం ఈనెల 14 (రేపటి)తో ముగుస్తోంది. కానీ ఇప్పటి వరకు ఎన్నికలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం పాలకవర్గాల పదవీకాలం రేపటితో (శుక్రవారం) ముగి యనుండడంతో మరో ఆరు నెలలు పదవీకాలం పొడిగిస్తా రని భావించారు. గతంలో ఇలాగే పొడిగించారు. కానీ ఇపు డు రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో పదవీకాలం పెంచకపోవచ్చనే తెలుస్తోంది. ఇప్పటికే పంచాయతీలు, మండల పరిషత్తులు, పురపాలికల పాలకవర్గాల పదవీకాలం ముగియగా, వాటిల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. 2020 ఫిబ్రవరి 15న సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించారు. దీంతో ఈనెల 14న సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలం ముగియనుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో సహకార సంఘాల ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేదు. దీంతో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, పురపాలికల మాదిరిగా ఆయా సంఘాలకు ప్రత్యేకాధికారుల పాలన అనివార్యం కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు రెండు, మూడు సొసైటీలకు ఒకరు చొప్పున జిల్లా స్థాయి అధికారులకు ఈ బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం పాలక వర్గాల గడువును పొడిగిస్తుందా లేక ప్రత్యేకాధికారుల పాలనకే గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనేపథ్యంలో జిల్లాలో నూతన మం డలాలైన తరిగొప్పుల, చిలుపూర్‌లలో కొత్తగా రెండు సహకా ర సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపింది. కొత్త సంఘాల ఏర్పాటు తరువాతే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అయితే నూతన పాలకవర్గాల ఎన్నికల తరువాతే జిల్లా కేంద్రాల్లో బ్యాంకులను ఏర్పాటు చేస్తారన్న వాదన వినిపిస్తోంది.

ప్రత్యేక పాలనా లేక పొడిగింపా...?

సహకార ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం వీటిని వాయిదా వేసే అవకాశం ఉంది. పాలకవర్గ పదవీకాలం ముగిసిన తరువాత ప్రభుత్వం సంఘాలకు పర్సన్ ఇంచార్జీలుగా అధికారులను నియమిస్తారా..? లేక మరో ఆరు నెలలు ఇదే పాలకవర్గాల పదవీ కాలం పొడిగిస్తారా..? అనే విషయమై స్పష్టత రాలేదు.



జఫర్‌గడ్ సొసైటీ కార్యాలయ భవనం

బ్యాంకుల విస్తరణ ఏదీ..?

ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. కానీ ఆయా జిల్లాల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులను విస్తరించలేదు. రైతులు దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాలు పొందే విషయంలో ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేం ద్రంలో కేంద్ర సహకార బ్యాంకును ఏర్పాటు చేయాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

కొనసాగుతున్న సభ్యత్వాల ప్రక్షాలన...

ఆయా సంఘాల పరిధిలో ఉండే రైతుల సభ్యత్వాలతో పాటు వారి ఖాతాలను ఆధార్ అనుసంధానిస్తూ ఈ -కేవైసీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 14 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం సుమారు 40 వేల మంది వరకు రైతులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని 11 సంఘాలు డీసీసీబీ పరిధిలో ఉండగా, కొడకండ్ల, కల్లెం, నిడిగొండ మూడు సహకార సంఘాలు ఎస్‌బీఐ పరిధిలో ఉన్నాయి. పలు సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్న రైతులు ఇప్పటి వరకు వారే కొనసాగుతున్నారు. ఇందులో కొంత మంది భూములు విక్రయించుకున్నారు. మరి కొంత మంది మృతి చెందారు. కొన్ని చోట్ల రైతులు రెండు, మూడు సంఘాల్లో సభ్యత్వం పొందారని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. సభ్యుల వివరాలు సరిగా లేకపోవడంతో పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల రుణమాఫీ జాబితాల్లో అవకతవకలు వెల్లడయ్యాయి. ఈ నేపథ్యంలో సంఘాలతో పాటు సభ్యత్వ ప్రక్షాళన చేపట్టారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు : రాజేందర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి, జనగామ

సహకార సంఘాల ఎన్నికలపై ఎటువంటి మార్గదర్శకాలు అందలేదు. జిల్లాలోని సహకార సంఘాల పాలకవర్గం పదవీకాలం ఈనెల 14తో ముగియనుంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగుతాం. జిల్లాలో మొత్తం 14 సొసైటీలు ఉన్నాయి. కొత్తగా మరో రెండు సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.


ఆధార్ వాలిడేషన్‌పై మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

ఆధార్ వాలిడేషన్‌ను త్వరగా పూర్తి చేయాలి

మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ వాలిడేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఏకశిల ఏంజిల్స్ హై స్కూల్‌లో బుధవారం పీఎం శ్రీ, యు-డైస్ ప్లస్, ఆధార్ వాలిడేషన్‌పై ఎంఈవోలు, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో ఐఎస్సీ ప్యానెల్ శిక్షణ శిబిరంలో గణితం, జీవశాస్త్రం, భౌతిక రసాయనశాస్త్రం, సాంఘీక శాస్త్రంకు సంబంధించిన ఐఎఫ్‌పీ ప్యానల్స్, డిజిటల్ బోర్డులను వినియోగంపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐఎఫ్‌పీ, డిజిటల్ బోర్డులను ఉపయోగిస్తూ బోధన చేయాలన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో కూడా నిర్వహించే శిక్షణ సమావేశాలని విజయవంతం చేయాలన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు ఐఎఫ్‌పీ ద్వారా బోధన చేయాలని, ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా విద్యార్థులకు పాఠ్యాంశాలు చెప్పవద్దన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఐఎఫ్‌పీల వినియోగాన్ని ఉపాధ్యాయులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజేశ్వర్‌రావు, ఎఫ్ఏవో మహంకాళి బుచ్చయ్య, కో-ఆర్డినేటర్లు పూర్ణచందర్, చంద్రశేఖర్ ఆజాద్, సంతోష్, కోటియా, సిరినాయక్, రిసోర్సు పర్సన్‌లు పాల్గొన్నారు.

మేడారానికి బయలు దేరిన పూజారులు

గంగారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలో కొలువైన సమ్మక్క భర్త పగిడిద్దరాజు ఆలయం నుంచి పూజారులు పసుపు కుంకుమలు తీసుకుని బుధవారం మేడారం బయలు దేరినట్లు ప్రధాన పూజారి పెనక రాజేశ్వర్ తెలిపారు. ములుగు జిల్లా మేడారంలో జరిగే మినీజాతరకు పగిడిద్దరాజు ఆలయం నుంచి పసుపు కుంకుమలతో సాయంత్రం మేలతాళాలతో దట్టమైన అడవి మార్గంలో కాలినడకన ప్రయాణమయ్యారు. ఈ బృందం గురువారం తెల్లవారు జామునకు మేడారం పగిడిద్దరాజు గద్దెకు చేరుకుంటుందని వివరించారు. పగిడిద్దరాజుతో తరలివెళ్లిన వారిలో పెనక పురుషోత్తం, సురేందర్, పెనక సమ్మయ్య, రాహుల్, సురేష్ ఉన్నారు.


పూనుగొండ్ల నుంచి పసుపు, కుంకుమలతో బయలు దేరిన పూజారులు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామన్నగూడెంలో విషాదం

నర్సింహులపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చాపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో బుధవారం జరిగింది. ఎస్సై మాలోత్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుండి ఉప్పలయ్య(45) ముంగిమడుగు పరిధిలోని వెంకమ్మ చెరువు బైండ్లోని దగ్గరలోని ఓ బురద గుంతలో కర్రకు విద్యుత్ వైరును ఏర్పాటు చేసి చేపలు పడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పలయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


ఉప్పలయ్య (ఫైల్)

తాగునీటి కొరత లేకుండా చూడాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో మునిసిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరు పట్టణానికి సరఫరా అవుతున్న మంచినీటి బావులు, బోర్‌లను ఆమె పరిశీలించి ఫోన్‌లో అధికారులకు తగు సూచనలు చేశారు. భగీరథ నీటితో పాటు మంచినీటి బావులను కూడా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు నిరంతర సరఫరాకు అన్ని విధాల కృషి చేస్తున్నామని, మరికొన్ని రోజుల్లో పట్టణంలో ప్రతిరోజు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.నిరంజన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, రాంచంద్రయ్య, నరేందర్ రెడ్డి, దరావత్ సోమన్న, దొంగరి శంకర్, కిషన్ యాదవ్, మహ్మద్ జలీల్, సురేష్ తదితరులు ఉన్నారు.


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దవంగర (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. వడ్డెకత్తైపల్లి గ్రామ శివారులోని బయన్నవాగుపై నిర్మించిన డ్యామ్‌ను పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ దేశం అబ్బురపడేలా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కొనసాగుతున్నాయన్నారు. తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, బ్లాక్ అధ్యక్షులు హట్యానాయక్, మాజీ పీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ జడ్పీఫ్లోర్‌లీడర్ ఎన్. ప్రవీణ్‌రావు, జాటోత్ నెహ్రూనాయక్, విజయపాల్‌రెడ్డి, రంగు మురళి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన అట్టర్‌ప్లాప్

- స్థానిక సంస్థల్లో ఎగిరేది గులాబీ జెండానే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ప్లాప్ అయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటేనే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు రోడ్ల మీద తిరిగే పరిస్థితి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మునిగిన నావ అని, గతంలో 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉండేదని, ఇప్పుడు మూడు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో పని చేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలే త్వరలో బొంద పెడతారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, యాదగిరిరావు, సోమనర్సింహారెడ్డి, శ్రీరాం రాము, అనపురం రవి, పూర్ణచందర్, భాస్కర్, పటేల్, కుమార్, సతీష్, అనుదీప్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలి

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ


జిల్లా మహా సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పష్య పద్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో జంపాల రవీందర్ అధ్యక్షతన బుధవారం జరిగిన రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ములుగు జిల్లా నుంచి దూర ప్రాంతాలకు సాగునీటిని తరలిస్తున్న పాలకులు ఈ జిల్లాలోని చెరువులను ఎందుకు అనుసంధానం చేయడంలేదని ప్రశ్నించారు. ఈవిషయంలో రాష్ట్రమంత్రి సీతక్క చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ములుగు మండలంలోని బొగ్గులవాగుపై చెక్ డ్యామ్ నిర్మించాలని, దీంతో 300 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని అన్నారు. వర్షాకాలంలో రహదారి సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని అన్నారు. పొట్లాపూర్ ఏదుళ్లచెరువు దగ్గరి నుంచి నర్సంపేట రంగాయ చెరువుకు తరలిస్తున్న నీటిని ఏదుళ్ల చెరువు వద్ద చెక్‌పాయింట్ ఏర్పాటు చేయాలని, వాజేడు మండలంలోని మోడికుంటవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, అనేక గ్రామాల్లో నీటి వసతి కల్పించాలని, పోడుభూములకు పూర్తిస్థాయిలో హక్కుపత్రాలు అందించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, నాయకులు సారంగపాణి, మామిడాల సమ్మిరెడ్డి, మంద సదాలక్ష్మి, ఎమ్డీ.అమ్జద్‌పాషా, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బండి నర్సయ్య, గడ్డం కృష్ణ, బండారి శ్రీనివాస్, నాసర్, రైతు ప్రతినిధులు జక్కుల ఐలయ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మున్నూరు కాపు సంఘం నాయకులు

కేసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణనలో మున్నూరుకాపు కులస్థుల సంఖ్యను తక్కువగా చూపారని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి బుధవారం తరలిరావాలని సంఘం ఇచ్చిన పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మున్నూరుకాపు సంఘం నాయకులను చందా గోపి, ముత్యాల శివకుమార్, సింగంశెట్టి యాకాంతం(చంటి), లక్కాకుల సత్యనారాయణ, సుందర్ వెంకన్న, పాల శ్రీనివాస్, కముటం పెద్దస్వామి, తోట నాగయ్య, పిన్ని రామును తెల్లవారుజామునే పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.


కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మున్నూరు కాపు సంఘం నాయకులు

గుడుంబా స్థావరాలపై దాడులు

నెహ్రూ సెంటర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి, టాస్క్‌ఫోర్స్ సీఐ నీరజ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని కురవి మండలం రేకులతండా, బాలుతండా, హరిదాస్‌తండా, కంచర్లగూడెం, మహబూబాబాద్ ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఏడుగురుపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 35 లీటర్ల గుడుంబా, 120 కిలోల బెల్లం, 8 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. సంబంధిత బాధితులను ఆయా తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేసినట్లుపేర్కొన్నారు. ఈ దాడుల్లో సీహెచ్.నాగేశ్వర్‌రావు, బిక్షరెడ్డి, అశోక్‌కుమార్,చంద్రశేఖర్, కిరిటి, సతీష్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గుడుంబా, బెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2109	2100
పల్లికాయ (సూక)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	4700	3100
కందులు	7083	5540
పెసళ్లు	6682	5645
పత్తి	6950	5800
పసుపు (కాడి)	7677	6425
తేజ మిర్చి	13300	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14700	11500
యూఎస్ 341	13550	11500
దేశీ ఏసీ	25011	22500
దీపిక	16110	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కాళేశ్వరంలో గోదావరి హారతి

మహదేవపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు బుధవారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి నాడు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. బుధవారం కాళేశ్వర ప్రధాన అర్చకులు టి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు కాళేశ్వర దేవస్థానం నుంచి మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ వేద మంత్రోచ్చరణలతో గోదావరి నదికి చేరుకున్నారు. అనంతరం గోదావరి నది హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్. మహేష్, దేవస్థాన సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.


గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు



సమావేశంలో మాట్లాడుతున్న విజయచందర్‌రెడ్డి

సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

బీజేపీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి విజయచందర్‌రెడ్డి

ములుగు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ విజయచందర్‌రెడ్డి కోరారు. ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన శాసన మండలి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు బీజేపీకి ఓటేసేలా కృషి చేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకాక, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, 317జీవోతో స్థానికతను కోల్పోయారని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బీజేపీ ముందుండి పోరాడిందన్నారు. అధికార పక్షాన్ని మండలిలో ప్రశ్నించే గొంతుకగా బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నంపల్లి పాపన్న, నాయకులు కొత్త సుధాకర్‌రెడ్డి, భూక్యా జవహర్‌లాల్, కొత్త సురేందర్, శ్రీలమంతుల రవీంద్రాచారి, భర్తపురం నరేష్, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, జాడి వెంకట్, గుగులోతు స్వరూప, పల్ల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మరిపెడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆకేరు, పాలేరు వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీష్ గౌడ్ తెలిపారు. మండలంలోని బాల్ని ధర్మారం, తానంచెర్ల రెవెన్యూ పరిధి అజ్మీరాతండ సమీపంలో ఆకేరు, పాలేరు వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్న బాదావత్ హరికృష్ణ, కొంపెల్లి మహేష్, భూక్య చంటి, ముదిరెడ్డి సురేష్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

మహదేవపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఇసుక లారీ ఢీకొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ శివారులోని ఎడపల్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. భూపాలపల్లికి చెందిన ఉజ్జల ప్రేమ్, మేకల రాకేష్, లక్ష్మణ్ అనే యువకులు ఒకే మోటారు సైకిల్‌పై కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకొని తిరిగి భూపాలపల్లికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కాళేశ్వరం- మహదేవపూర్ రహదారిలోని ఎడపల్లి వద్ద గుర్తు తెలియని ఇసుక లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రోడ్డుపై పడి ఉన్న యువకులను చూసి మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. ప్రథమ చికిత్స కోసం అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్లు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపారు. ఈ ఘటనపై తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంతో రోడ్డుపై వాహనాలు గంట సేపు నిలిచాయి. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరించడంతో పాటు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పీఏసీఎస్ డైరెక్టర్ ఆత్మహత్య

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో మనస్తాపానికి గురైన మన్నెగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ గజ్జి రమేష్ (48) ఆత్మహత్యాయత్నం చేసి, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుక్కొయ్యలపాడుకు చెందిన గజ్జి రమేష్ గతంలో కుటుంబ అవసరాల కోసం రూ. 6 లక్షల అప్పు చేశాడు. తనకున్న నాలుగు ఎకరాల భూమిలో ఎకరం భూమిని విక్రయించి, కొంత మేర అప్పులు తీర్చాడు. అయినా మరికొంత అప్పు ఉండడంతో అవి ఎలా తీర్చాలని మనస్తాపానికి గురైన రమేష్ ఈనెల 5న తన వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


గజ్జి రమేష్ (ఫైల్)

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి

పెద్దవంగర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గీతకార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నవంగర గ్రామానికి చెందిన అనపురం వెంకన్న (55) వ్యవసాయం చేస్తూ, కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండల కేంద్రం శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద కన్నె వేణు వ్యవసాయ క్షేత్రం శివారులో రోజువారీ మాదిరిగా కల్లుగీసేందుకు వెళ్లాడు. వ్యవసాయ క్షేత్రం వద్ద మొక్కజొన్న పంటను కోతుల నుంచి కాపాడుకునేందుకు విద్యుత్ వైర్లను అమర్చడంతో ప్రమాదవశాత్తు వెంకన్న చేయి, కాళ్లు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వెంకన్నకు భార్య అనుసూర్య, ఇద్దరు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలంను పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



శ్రీతేజ్ | జి. రమేష్ | జి. తరుణ్ | ఎన్. హన్సిక | అన్వర్‌పాషా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శివాని విశ్వరూపం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హనుమకొండలోని శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించి విశ్వరూపం ప్రదర్శించారని కళాశాల కరస్పాండెట్ టి.స్వామి, ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు, ఎన్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి తెలిపారు. జేఈఈ మెయిన్స్ సెషన్-2025 ఫలితాల్లో కళాశాలకు చెందిన కె.శ్రీతేజ్ 97.97, జి.రమేష్ 95.88, జి.తరుణ్ 95.66, ఎన్.హన్సిక 95.30, ఎండి. అన్వర్ పాషా 94.84 ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో షైన్ ప్రభంజనం



జి. వికాస్



శ్రీమహేష్



సీహెచ్ శ్రీతన్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ -2025 ఫలితాలలో 98.59 పర్సంటైల్ సాధించి విజయదుందుభి సాధించామని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, డైరెక్టర్లు మూగల రమ, పి.రాజేంద్రకుమార్, మూగల రమేష్ సంయుక్తంగా తెలియజేశారు. మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కళాశాల జాతీయ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్‌లలో అత్యుత్తత శిక్షణను అందిస్తోందని తెలిపారు. అకడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా విద్యార్థులను ఆణిముత్యాలుగా తయారు చేసి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నామని ఈ సందర్భంగా జి.వికాస్ 98.59, పి.శ్రీమహేష్ 97.23, సీహెచ్.శ్రీతన్ 96.04 పర్సంటైల్‌ను సాధించిన ర్యాంకులు విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు 29 మంది విద్యార్థులు 90.0 పర్సంటైల్ పైగా ఫలితాలు సాధించారని చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల డైరెక్టర్ ఐఐటీ కోఆర్డినేటర్ రమేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ మారబోయిన రాజుగౌడ్, శ్రీనివాసన్, సంధ్యా, ప్రశాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కెరీర్ పాయింట్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కెరీర్ పాయింట్ చైర్మన్, ఫ్యాకల్టీ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ(మెయిన్స్) - 2025 ఫలితాలలో హనుమకొండ న్యూశాయంపేటలోని కెరీర్ పాయింట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించినట్లు కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జూలపల్లి కరుణాకర్‌రావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం కెరీర్‌పాయింట్‌లో చైర్మన్, డైరెక్టర్‌లు అభినందించారు. కెరీర్ పాయింట్‌లకు చెందిన వి.రామ్‌చరణ్ 99.86, భవేష్ 99.71, శ్రీచైత్ర 99.49, సుధీష్ 99 పర్సంటైల్‌తోపాటు మరికొందరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చైర్మన్ కరుణాకర్‌రావు తెలిపారు. చైర్మన్‌తో పాటు బ్రాంచ్ డైరెక్టర్లు, మధుపాల్‌రావు, ప్రిన్సిపాల్ దేవేందర్ కోటా ఫ్యాకల్టీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

రెజోనెన్స్ విజయదుందుభి



జేఈఈ మెయిన్స్ సెషన్-1 విజేతలతో రెజోనెన్స్ చైర్మన్ రాజిరెడ్డి, ఫ్యాకల్టీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రెజోనెన్స్ కళాశాల విజయదుందుభి మోగించడం హర్షణీయమని రెజోనెన్స్ వరంగల్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం హనుమకొండలోని కళాశాలలో జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎం.చరణ్ 99.89 పర్సంటైల్ సాధించడంతో పాటు ఫిజిక్స్‌లో 100 శాతం పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే బి.వెంకట్ జశ్వంత్ 99.66, సీహెచ్. సాయిదత్తు 99.59, కె.శిత్రీజ్ 99.56, వి.శశికౌశిక్ 99.48, ఎండి. ఉర్ రహ్మాన్ 99.27, వి.వి. ఫణి హర్షిత్ 99.26, వి.రాజశేఖర్ 99.25 పర్సంటైల్ సాధించినట్లు ఆయన వివరించారు. వీరితో పాటు మరికొంత మంది విద్యార్థులు దేశంలోని సుప్రసిద్ధ ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హత సాధించారన్నారు. పోటీ పరీక్షలు ఏవైనా రెజోనెన్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. దీనంతటికీ విద్యార్థుల శ్రమ, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏవో లెక్కల రమ్యరెడ్డి, అకడమిక్ డీన్ టీఎస్. గోపాల్‌రావు, కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మోషన్ కళాశాల విజయ కేతనం



గుడి వంశీప్రియ



ఎం సహస్ర



జీ అశ్విత



బూర్ల వర్షిత



కే ప్రహర్షిత



సామంతుల శ్రీనిధి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025లో మోషన్ విద్యాసంస్థల విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఈఈ ఫలితాలలో గుడి వంశీప్రియ 97.56, గుండబోయిన అశ్విత 95.88, కొండపాక ప్రహర్షిత 92.53, ముదుతనపల్లి సహస్ర 92.34, బూర్ల వర్షిత 91.52, సామంతుల శ్రీనిధి 90.02, పర్సంటైల్ సాధించి మోషన్ కీర్తి ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో నిలబెట్టడం పట్ల హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఫలితాలు సాధించిన విద్యార్థులను వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్‌తో పాటు కళాశాల యాజమాన్యం అభినందించింది.



మండమెలిగె సందర్భంగా జాగారం కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క



మేడారం వన దేవతల గద్దెల వ్యూ

మండమెలిగె.. మది మురిసే

మేడారంలో ఘనంగా మినీ జాతర వేడుకలు

- అంతర్గత పూజలు చేసిన పూజారులు
- కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండ మెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకు పూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప, ధూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. అనంతరం మేడారంలోని గద్దెలకు డోలు వాయిద్యాలు కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్ల ఆరబోస్తుండగా పూజారులు వడ్డెలు గద్దెలకు చేరుకొని జాగారం చేశారు. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు వన దేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

జంపన్నవాగులో స్నానాలు ఆచరించి..

ముందుగా జంపన్నవాగులోని స్నానఘట్టాలపై ఏర్పాటు చేసిన నల్లాల కింద పుణ్యస్నానాలు చేసి వాగు ఒడ్డున ఉన్న కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాలు, డప్పు సప్పుల్ల నడుమ శివసత్తుల పూనకాలతో ఎత్తు బంగారం మోస్తూ గద్దెలకు చేరుకున్నారు. తల్లులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరెలు, సారెలు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారాని సమర్పిచారు. కోరికలు తీరాలని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భద్రత

మినీ జాతరలో పోలీసులు భారీ భద్రత కల్పించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తులు సులభంగా దర్శనాలు చేసుకొనేలా చర్యలు చేపట్టారు. ఈ బందోబస్తును ములుగు డీఎస్పీ రవీందర్ పర్యవేక్షించారు. అలాగే మినీ జాతర సందర్భంగా వనదేవతలు సమ్మక్క, సారలమ్మల దర్శనానికి తరలివచ్చిన భక్తులను దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. మేడారం పరిసరాలు, గద్దెల వద్ద దొంగలున్నారని, భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. కాగా, మేడారం మినీ జాతర సందర్భంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు తప్పిపోతే తమ వద్దకు రావాలని దేవాదాయ శాఖ అధికారులు అనౌన్స్‌మెంట్ చేశారు. గద్దెల ప్రాంగణంలో రద్దీగా ఉడటంతో తప్పిపోయిన వారిని పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బయ్యక్కపేటలో చందా వంశీయుల జాగరణ

తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో చందా వంశీయులు సమ్మక్క తల్లిని ఆడబిడ్డగా కొలుస్తారు. ఈ క్రమంలో గురువారం దేవర గుట్ట నుంచి సమ్మక్క ప్రతిమ రూపంలో కుంకుమ పువ్వును తీసుకువస్తారు. అయితే బుధవారం గ్రామంలోని వనదేవతల గద్దెల వద్ద జాగరణ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు.

చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం

మేడారం మినీ జాతరకు తరలి వచ్చిన భక్తుల పిల్లలకు, గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వనదేవతల గద్దెల ప్రాంగణంలో పంపిణీ చేశారు. బాదం పాలు, మల్టీ విటమిన్ పౌడర్, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో ఆర్. విజయ, సూపర్‌వైజర్ జి.రమాదేవి, ఎన్. శ్రావణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గద్దెలకు ప్రత్యేక అలంకరణ

మేడారంలో మినీ జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మ గోవిందరాజులు, పగిడిద్దరాజు గద్దెలు, పరిసరాలు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూలు, తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు కనువిందు కలిగేలా ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లతో నేరుగా దర్శనాలు

గత జాతరలకు విభిన్నంగా వనదేవతలను భక్తులు దర్శించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రతను పెంచి భక్తులకు నేరుగా దర్శనాలు కల్పించారు. గతంలో గేట్లు వేసి బయట నుంచే మొక్కులు చెల్లించుకునేవారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మేడారం మినీ జాతర సందర్భంగా భక్తులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ మ్యూజియం ఆవరణలో సాంసృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివాసీల నృత్యాలు, గీతాలతో ఆ ప్రదేశమంతా మార్మోగింది.



పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



దేవతలకు పెయ్యను సమర్పిస్తున్న చర్ప వంశీయులు



సమ్మక్క గుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



డోలు సన్నాయిలతో తరలి వస్తున్న పూజారులు



గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్



వన దేవతలను మొక్కుతున్న భక్తులు

కొత్త కానిస్టేబుళ్ల వేతన వెతలు!

- మూడు నెలలుగా జీతాలు రాక అవస్థలు
- ఇళ్ల అద్దెలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేని పరిస్థితి
- తల్లిదండ్రుల వద్ద చేయి చాపాల్సిన దుస్థితి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పోలీసు యూనిఫామ్‌పై ఉన్న ఇష్టంతో.. ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి.. కఠినమైన శిక్షణ పూర్తి చేసి.. కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరిన వారు వేతన వెతలు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం సక్రమంగా వేతనాలు విడుదల చేయకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. నౌకరీ వచ్చిన సంబురం కూడా తమకు లేకుండా నెలనెలా ఖర్చుల కోసం తల్లితండ్రులు, తోబుట్టువుల దగ్గర చేయి చాచాల్సి వస్తోందని, స్నేహితుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. వరంగల్ కమిషనరేట్‌కు 578 మంది మహిళ, పురుష కానిస్టేబుళ్లను నవంబరులో కేటాయించగా వారు డిసెంబరు నుంచి వివిధ జోన్లలోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టింగ్స్ ఇచ్చి అప్పుడే రెండు నెలల 10 రోజుల సర్వీసును పూర్తి చేసుకున్న ఆ యువ కానిస్టేబుళ్లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు.

స్టైఫండ్ పైసలూ ఇంతవరకు అందలేదు..

శిక్షణ సమయంలో నెలకు రూ.13వేల వేతనాన్ని స్టైఫండ్ కింద ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా వసతి, మెస్ చార్జీలు పోను సుమారు రూ.8వేల పై చిలుకు నెలనెలా శిక్షణ కానిస్టేబుళ్ల ఖాతాల్లోకి జమ చేసేది. అలా 9 నెలల శిక్షణ కాలంలో 6 నెలలకు మాత్రమే చెల్లించి 3 నెలల స్టైఫండ్‌ను నిలిపివేశారు. ఇప్పటికీ ఆ డబ్బులు వారి ఖాతాల్లో జమచేయలేదు. శిక్షణ ప్రారంభ సమయంలో రూ.6వేలను ప్రతి అభ్యర్థితో డిపాజిట్ చేయించుకొని ఇప్పటి వరకు వాటి ఊసేత్తడం లేదని కొంత మంది కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఒక్కొక్కరికి సుమారు రూ.లక్ష 30వేల పై చిలుకు వేతనాలు చెల్లించాల్సి ఉందని కానిస్టేబుళ్లు పేర్కొంటున్నారు.

ఇంటి అద్దెలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు

కొలువు వచ్చిందనే ఆనందం లేకుండా ఉందని పలువురు యువ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు కాదనుకుని ప్రజా సేవ చేసేందుకు పోలీస్‌శాఖలోకి వస్తే.. ఉద్యోగం వచ్చిన ప్రారంభంలోనే ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతున్నారు. హాస్టల్ ఫీజు, రూమ్ అద్దెలు చెల్లించలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, ఉద్యోగం చేస్తున్నా.. గత్యంతరం లేక తల్లితండ్రులను, తోబుట్టువులు, స్నేహితుల వద్ద చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ వేతనాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే వేతనాలు అందించాలని యువ ఖాకీలు కోరుతున్నారు.

సీపీవో సిబ్బంది నిర్లక్ష్యం

నవంబరు 21 న 578 మంది కానిస్టేబుల్స్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేస్తే సెంట్రల్ జోన్‌కు 145, వెస్ట్‌జోన్‌కు 119 మంది, ఈస్ట్‌జోన్ 68 మంది, మరో ఐదుగురిని ఇతర విభాగాలకు కేటాయించారు. వారంతా చాలా ఉత్సాహంగా విధుల్లో చేరారు. మొదటి జీతంతో తల్లిదండ్రులకు కానుక ఇవ్వాలని కొందరు, బైక్ కొనుక్కోవాలని మరికొందరు, అక్కా చెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు తమ గుర్తుగా బహుమతులు ఇవ్వాలని కలలు కన్నారు. కానీ వారి కలలన్నీ ఆవిరయిపోయాయి. మూడు నెలలుగా జీతాలు ఎప్పుడొస్తాయని ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వేతనాలు విడుదలైనా ఇక్కడి సీపీవో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే వేతనాలు ఆలస్యమవుతున్నాయని తెలుస్తోంది. వారి అశ్రద్ధ వల్ల పోలీసులకు సకాలంలో వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని సమాచారం. ప్రతీ పనిని వాయిదా వేస్తూ ఒక్క రోజులో పూర్తి చేయాల్సిన పనిని నాలుగైదు రోజులకు జరుపుతుండటంతో యువ ఖాకీలే కాదు కమిషనరేట్‌లోని మిగతా సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

ఖాతాల్లో సమస్యలున్నాయి.. త్వరలో విడుదలవుతాయి

రవి, అడ్మిన్ అడిషనల్ డీసీపీ

శిక్షణ సమయంలో ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాలు కాకుండా వేరే ఇవ్వడం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లలో తప్పులు దొర్లడం, పాన్ కార్డులు లింక్ కాకపోవడం లాంటి సమస్యలతో వేతనాలు నిలిచిపోయాయి. స్టైపెండ్‌కు సంబంధించిన 3 నెలల జీతం ఇప్పటికే కానిస్టేబుళ్ల ఖాతాల్లోకి జమయ్యాయి. సీపీవో సిబ్బంది 15 రోజులుగా ఖాతాల్లో తలెత్తిన సమస్యలను సరిదిద్దే పనిలో ఉన్నారు. త్వరలోనే వేతనాలు విడుదలవుతాయి.

నోటిఫికేషన్ లేకుండానే పోస్టు భర్తీ

ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ నియామకంపై ఆరోపణలు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా రాజీవ్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ పోస్టును ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేయడంపై వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కిందట ఓ వైద్యుడు నియామకపత్రంతో కార్యాలయానికి రావడంతో ఆశావహులైన మిగతా వైద్యులు అవాక్కయ్యారు. ఒక పక్క ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఈ పోస్టు భర్తీ చేయడం వెనుక రూ.లక్షల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ప్రైవేట్ ప్రాక్టీస్ ఉన్నవారికి ఈ పోస్టులో నియమించకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు విస్మరించినట్లు విమర్శలు ఉన్నాయి. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించిన కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. రోగుల నుంచి ప్రైవేట్ ఆస్పత్రులు అదనంగా వసూలు చేస్తున్నాయా? సేవలు సమర్థవంతంగా అందుతున్నాయా? అనే విషయాలపై ఆరా తీయాల్సిన కో ఆర్డినేటర్‌కే ప్రైవేట్ క్లినిక్‌లు ఉంటే అజమాయిషీ ఎలా చేయగలరని ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు అర్హులైన వైద్యులను కో ఆర్డినేటర్‌గా నియమించాలని వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు షురూ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి రీజినల్ హెడ్ పగడాల రవికుమార్, సెంటర్ హెడ్ నమ్రత మాట్లాడుతూ.. మెడికవర్ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు శుభపరిణామమన్నారు. 12 దేశాలలో ప్రపంచస్థాయి వైద్య సేవలు అందిస్తున్న ప్రఖ్యాత మెడికవర్ హాస్పిటల్స్ హనుమకొండలోని ఈ 300 పడకల ఆస్పత్రికి రాజీవ్ ఆరోగ్య శ్రీ అనుసంధానించడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా గుండె చికిత్సలు, గుండె ఆపరేషన్లు, మూత్ర సంబంధిత సమస్యలకు వైద్యం, కిడ్నీ ఆపరేషన్లు, డయాలసిస్ సేవలు, మెదడు ఆపరేషన్లు, క్యాన్సర్ వైద్య సేవలు (మెడికల్ సర్జికల్ అంకాలజీ)వంటి ఖర్చుతో కూడిన వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా పొందవచ్చన్నారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రిలో మొదటి ఆరోగ్య శ్రీ అడ్మిషన్‌ను పేషెంట్ బంధువులకు డాక్టర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



మెడికవర్ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన పేషెంట్‌కు రాజీవ్ ఆరోగ్య శ్రీ రిజిస్ట్రేషన్‌ను అందజేస్తున్న డాక్టర్లు

ఫిల్టర్ బెడ్ వృథా నీటిని వాగులోకి మళ్లించాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఫిల్టర్ బెడ్ వృథా నీటిని వాగులోకి మళ్లించాలని మండలంలోని చీటకోడూరు గ్రామరైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం జనగామ మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చీటకోడూరు రిజర్వాయరు నుంచి జనగామ పట్టణానికి తాగునీటిని అందించడానికి రిజర్వాయరు పక్కనే ఫిల్టర్ బెడ్ నిర్మించారన్నారు. అయితే నీరు ఫిల్టర్ అయ్యే క్రమంలో విడుదలయ్యే వృథా (వేస్ట్ వాటర్) నీటికి దారి చూపకుండా వదిలేశారు. దీంతో ఆ నీరు సమీప రైతుల వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే మార్గం గుండా వెళ్తుండడంతో ఆ నీటిలోంచి వెళ్లడానికి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొండల్‌రెడ్డి, కరుణాకర్, యాదగిరి, ఉదయ్, నర్సయ్య పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు

బచ్చన్నపేటలో పోలీస్ ఉన్నతాధికారుల పర్యటన

బచ్చన్నపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట మండలంలో బుధవారం పోలీస్ ఉన్నతాధికారులు విస్తృతంగా పర్యటించారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండరి నితిన్ చేతన్, సీఐ అబ్బయ్యలు పర్యటించారు. పోచన్నపేట వాగును సందర్శించారు. వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలుంటాయని డీసీపీ హెచ్చరించారు. ఇసుక ట్రాక్టర్లు వాగులోకి వెళ్లే ప్రదేశాలు గుర్తించి జేసీబీతో కందకాలు తవ్వించారు. అనంతరం కొడవటూరు సిద్ధేశ్వరాలయాన్ని సందర్శించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శివకళ్యాణం, అగ్నిగుండాలు జరిగే ప్రదేశాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్‌ఐ ఎస్‌కే హమీద్‌ను ఆదేశించారు. అనంతరం త్వరలో జరగబోయే ఎన్నికలను పురస్కరించుకుని పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలు, రౌడీ షీటర్ల ప్రవర్తన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై చర్చించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోచన్నపేట వాగును పరిశీలిస్తున్న డీసీపీ, ఏఎస్పీ తదితరులు

● జఫర్‌గఢ్ : ఇసుక రవాణా నియంత్రణకు పోలీసు శాఖ వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది. మండలంలోని తిడుగు, కూనూరు, ఉప్పుగల్లు ఆకేరు వాగుల్లో నుంచి ఇసుకను పట్టణ నగర ప్రాంతాలకు అక్రమంగా తరలించుకుపోతున్నారు. తరచుగా దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నా ఇసుక రవాణా ఆగడం లేదు. అయితే వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు గాను.. వాగుల్లోకి వాహనాలు వెళ్లకుండా రవాణా చేసే ఇసుక ప్రాంతాల్లో యంత్రాలచే పెద్ద పెద్ద గోతుల తవ్వకం చేపడుతున్నారు. బుధవారం జఫర్‌గఢ్ ఎస్‌ఐ రాంచరణ్ నాయక్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది మండలంలోని కూనూరు ఆకేరు వాగులో యంత్రాలచే ట్రెంచ్‌ల తవ్వకం (లోతైన పెద్ద గోతులు) చేపట్టారు. ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తామని తెలిపారు.

అరూరికి పలువురు నేతల పరామర్శ


వెంకటమ్మ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను బుధవారం ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవిందర్‌రావు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, కొండేటి శ్రీధర్, రాజేశ్వర్‌రావు, ధర్మారావు, వన్నాల శ్రీరాములు, హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ, తదితరులు పరామర్శించారు. రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో ఉప్పుగల్లులో ఆమె చిత్ర పటం వద్ద వారితో పాటు రాష్ట్ర రుణవిమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర నేతలు తాండ్ర వినోద్‌కుమార్, పెసరు విజయచందర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, గడ్డం రాజు, పులి ధనుంజయ్ గౌడ్, నాయిని నరేశ్, తదతర వివిధ పార్టీల నేతలు నివాళులు అర్పించారు.

చాకలి అయిలమ్మ విగ్రహావిష్కరణ


చాకలి అయిలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి అయిలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మండలంలోని పెద్దపహాడ్‌లో బుధవారం జరిగింది. రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటంలో విస్నూరు దేశ్‌ముఖ్ దొర ఆగడాలను ఎదుర్కొన్న వీరవనిత చాకలి అయిలమ్మ అన్నారు. నేటి తరానికి అయిలమ్మ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘం జిల్లా అధ్యక్షులు మైలారం వెంకటేశ్వర్లు, ఏదునూరి మదార్, ప్రేమలతారెడ్డి, అయిలమ్మ ముని మనవరాలు చిట్యాల మంజుల, చిట్యాల యాకయ్య, చిట్యాల పద్మ, కళింగరాజు, బోడ నరేందర్, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఏబీసీ కేటగిరీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన నాయకులతో సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వచ్చి వర్గీకరణ అంశంపై ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి అసెంబ్లీలో చర్చించి, ఎస్సీలకు ఏబీసీ కేటగిరీలలో రిజర్వేషన్లు అమలు చేయడానికి కార్యాచరణ ప్రకటించిన సీఎంకు ఎస్సీలు రుణపడి ఉంటారని తెలిపారు.

రూరల్ రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షుడిగా భిక్షపతి

చిలుపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా రూరల్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా మండలంలోని మల్కాపూర్ వెంకటసాయి రైస్‌మిల్ నిర్వహకుడు చిలగాని భిక్షపతి ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఎన్నుకున్న రైస్‌మిల్లర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ, మిల్లర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

గ్రామ దేవతలు సంస్కృతికి ప్రతిబింబాలు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య


రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రాజయ్య

చిలుపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబాలు అని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నష్కల్ గ్రామాన్ని సందర్శించిన ఆయన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేణుక ఎల్లమ్మ, పెద్దమ్మతల్లి, మార్కండేయ స్వామి తదితర కులదేవతల ఆలయాల నిర్మాణానికి పెద్దపీట వేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోడెం భిక్షపతి, చిర్ర శంకర్, ఆరూరి స్వామి, మోడెం స్వామి, చిర్ర రాజు, కర్ర సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన మనోజ్‌రెడ్డి

చిలుపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కవితను కలిసిన మనోజ్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో నెలకొన్న బీఆర్ఎస్ పరిస్థితిని గూర్చి ఆమెకు వివరించారు.

తాటికొండలో ఉర్సు ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటికొండ గ్రామంలో దర్గా షరీఫ్ హజరత్ రహల్ల హుసేని రహమతుల్లా అలై ఉర్సు ఉత్సవాలను బుధవారం ముస్లీం భక్తులు ఘనంగా నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు అచరించారు. దర్గా వద్ద అయన చాదర్ సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరుతూ దర్గా కమిటీ సభ్యులకు రూ 10వేల ఆర్థికసాయంను సుధీర్ రెడ్డి అందించారు. కమిటీ సభ్యులు ఎమ్డీ అబ్బాస్, ఎమ్డీ అక్బర్, కుర్బన్ అలీ, మోహసిన్ అలీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో అవకతవకలను సరిదిద్దాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే లోపే ఎస్సీ ఏబీసీలో ఉన్న అవకతవకలను సరిదిద్దాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. బుధవారం హన్మకొండలోని ఆయన కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ పై కార్యాచరణను ప్రకటించారు. వర్గీకరణ పై చర్చలు జరుపకుండా ఎస్సీ ఏబీసీ అని ప్రకటించడం వలన మాదిగలకు నష్టం జరుగుతుందన్నారు. జనాభ దామాషా ప్రకారం మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు, మాలలకు 4శాతం రిజర్వేషన్లు ప్రకటించాల్సి ఉన్నప్పటికి మాలలకు మేలుచేసేలా 5శాతం ప్రకటించడం తీవ్ర అన్యాయమన్నారు. మాదిగలకు ఇప్పుడు న్యాయం జరుగకపోతే మరెప్పుడు జరుగదని న్యాయం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలసిన అవసరం ఉందన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి


టెన్త్ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా కష్టపడి చదవాలని, తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని డీఈవో ఎం.రమేశ్ అన్నారు. శివునిపల్లి హైస్కూల్‌లో బుధవారం 10వ తరగతిని సందర్శించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో ఏఎంవో బి.శ్రీనివాస్, హెచ్‌ఎంలు కె.రమేశ్, ఎం.సంపత్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్, శ్రీనికాంత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సోషల్ బోధన ప్రణాళికాబద్ధంగా చేపట్టడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధిని సాధించవచ్చని డీఈవో ఎం.రమేశ్ అన్నారు. మంగళవారం శివునిపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిలుపూర్ మండలాల హైస్కూల్ సాంఘిక శాస్త్రం కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఏఎంవో బి.శ్రీనివాస్, హెచ్‌ఎం కె.రమేశ్, ఆర్‌పీలు కే.కృష్ణవేణి, డి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, రజని, సుధాకర్, పి.వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి) : మండలంలోని తొర్రూరు గుట్టపై శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఆలయ పండితులు మురళి, రఘు నేతృత్వంలో అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి రోజున ప్రతి ఏడాది వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి తిలకించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కళ్యాణోత్సవానికి హాజరై కన్నులారా తిలకించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, కడుదూరి కడుదూరి ప్రభాకర్, చిలువేరు కృష్ణమూర్తి, బాలరాజు, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ ప్రజాప్రతినిధులు చిదురాల దనుంజయ, నాయిని మల్లారెడ్డి పాల్గొన్నారు.

మార్మోగిన కాశీ విశ్వనాథ నామస్మరణ


ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు, భక్తులు

నర్మెట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నర్మెట మండలకేంద్రంలో ధ్వజ పంచాయతన నవగ్రహ సమేత శ్రీ కాశీవిశ్వనాథ శివలింగ ప్రతిష్ఠామహోత్సవాలలో భాగంగా రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్థాపిత దేవతామూర్తులకు హోమాలు చేశారు. దేవామూర్తులకు స్నపనం, శయ్యాధివాస, ధాన్యాధివాస, పుష్పాధివాసలముతో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు బ్రహ్మ శ్రీ పురాణం మహేశ్వరశర్మ కాశీ విశ్వనాథ విశిష్టతను ప్రవచనాలతో వివరించారు. కుంకుమార్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలతో కాశీ విశ్వనాథ నామస్మరణతో మారుమోగింది. ఆలయ ఆవరణలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేడు గురువారం శివ పంచాయతన సుబ్రహ్మణ్య ఆంజనేయ ధ్వజ నవగ్రహ సహిత శ్రీ కాశీ విశ్వనాథ లింగ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, బలిప్రదానం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి తెలిపారు.

వన దేవతలకు ప్రత్యేక పూజలు


సమ్మక్క బండపై వనదేవతలకు మొక్కుతున్న భక్తజనం

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : జఫర్‌గఢ్‌లోని సమ్మక్క బండ పై వన దేవతలైన సమ్మక్క-సారలమ్మ మినీ జాతర ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద బ్రాహ్మణ పండితులు జి.ప్రకాశ్‌శర్మ నేతృత్వంలో సమ్మక్క- సారలమ్మలకు విశిష్ట పూజలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని బంగారాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జంతు బలులను నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈనెల 14 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

తాటికొండలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ-జిట్టెగూడెం గ్రామల పరిధిలోని మల్లన్నగండి సమ్మక్క- సారలమ్మ, ఇప్పగూడెం గ్రామ పరిధిలోని చింతగట్టు సమ్మక్క- సారలమ్మ గద్దెలను భక్తులు బుధవారం దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు తల్లులకు బంగారం, కుంకుమ, పసుపును సమర్పించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాటికొండ జాతరలో మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తాటికొండ జాతర చైర్మన్ కొరుకొప్పుల మహేందర్‌గౌడ్, పండుగ బద్రి, తాటికొండ సంపత్, శ్రీనివాస్, పర్శ రాజు, చొక్కం శ్రీనివాస్, దామెర శ్రీనివాస్, పులి రవి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరుప్పుల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో బొలేరో వాహనం లోడ్ పీడీఎస్ బియ్యాన్ని దేవరుప్పుల పోలీసులు బుధవారం పట్టుకున్నారు. బోలేరో వాహనంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో లోడ్ చేస్తుండగా దాడి చేసి 15క్వింటాళ్లు పట్టుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొనుగోలు దారుడు భూక్యా రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు దేవరుప్పుల ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు

బిల్లుల చెల్లింపుపై విచారణ చేయాలి

జనగామ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): క్వాలిటీ కంట్రోల్ రిపోర్టర్ రాకుండానే బిల్లులు చెల్లించిన వ్యవహారం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ మాజీ కౌన్సిలర్ మారబోయిన పాండు అధికారులను కోరారు. ఈ మేరకు రాష్ట్ర విజిలెన్స్ విభాగానికి, మునిసిపల్ శాఖ డైరెక్టర్‌కు, ఇంజనీర్ ఇన్ చీఫ్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు బుధవారం లేఖ రాశారు. జనగామ పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి మంజూరైన డివైడర్, వైకుంఠ దామం, పట్టణంలో జరిగిన వివిధ రకాల పనులలో అవినీతి జరిగిందన్నారు. క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ రిపోర్టు రాకముందే బిల్లులు చెల్లించిన దానిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ జరిపి మునిసిపల్ నిధులను కాపాడాలన్నారు.

నేడు జనగామకు ఎమ్మెల్సీ కవిత రాక

జనగామ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత గురువాంరం జనగామకు రానున్నారు. జనగమలో జాగృతి నాయకుడి గృహ ప్రవేశానికి ఆమె హాజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు జనగామకు రానున్న ఆమె జనగామ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పిస్తారు. అనంతరం గృహప్రవేశానికి హాజరవుతారు. ఆ తరువాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు విలేఖరులతో మాట్లాడతారు. పలు అంశాలపై చర్చిస్తారు.

పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా తార

దేవరుప్పుల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా వడ్లకొండ తార నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునితారావు చేతులమీదుగా ఆమె బుధవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తార మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి అప్పగించినందుకు మహిళా కార్యకర్తల బలోపేతంకోసం అంకితభావంతో కృషి చేస్తానన్నారు.

● కొడకండ్ల : మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా అందె శ్రీవర్ణను నియమిస్తూ రాష్ట్రకాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు హైదరాబాద్ గాంధీభవన్‌లో నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు. తనను గుర్తించి రెండోసారి అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తున్న పార్టీ పెద్దలందరికీ శ్రీవర్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డికి, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీరెడ్డికి, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరికి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జంగా

దేవరుప్పుల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమడూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రుద్రోజు భాస్కరాచారి తండ్రి భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం అయన కుటుంబసభ్యులను రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా భాస్కరాచారిని ఓదార్చి భూమయ్య చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయులు బోనగిరి నర్సింహ, ఆకవరం రవీందర్‌రెడ్డి, నారెడ్డి సైదులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టొచ్చు

పాలకుర్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టే అవకాశం ఉందని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాఘవాపురంలో గ్రామస్తులకు సీసీకెమెరాల ఏర్పాటుపై సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో అవగాహన కల్పించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. కానిస్టేబుళ్లు రోహిత్, సూర్యప్రకాష్ ఉన్నారు.

కల్తీలేని ఆహారంతో ఆరోగ్యం

పాలకుర్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : కల్తీలేని ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి డాక్టర్ సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో సీసీ, ఎంఎస్ ఆశ్వర్యంలో వీఓఏలకు ఆరోగ్యంపై నాలుగు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని మాత శిశు సంక్షేమాధికారి సత్యవతి, ఎంపీడీవో రాములు, డాక్టర్ సిద్ధార్థరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్దార్థరెడ్డి మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రతి మంగళవారం మహిళల కోసం వైద్య పరీక్షలు న్విహించనున్నట్లు తెలిపారు. ప్రతీ మహిళ వినియోగించుకోవాలని సూచించారు. క్యాన్సర్, కల్తీలేని ఆహారం, చిన్న పిల్లలకు సెల్‌ఫోన్‌ల దుష్ప్రభావాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం నరేందర్, వీవోఏలు తదితరులుఉన్నారు.

ఘన్‌పూర్ లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): లయన్స్ రీజియన్ మీట్‌లో స్టేషన్ ఘన్‌పూర్ లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట పండింది. మొత్తం 11 సేవా కార్యక్రమాల్లో అవార్డులు గెలుచుకుందని క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు, కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తమ క్లబ్, అధ్యక్షుడు, కార్యదర్శి స్క్రాప్ బుక్, హంగర్ రిలీఫ్, పర్యావరణ కార్యక్రమం, కోశాధికారి, రక్తదాన శిబిరాలు, అంకిత భావం గల లయన్ అంశాల్లో ఈ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ బాధ్యులను పీడీజీ జాన్‌బన్నీ, జిల్లా లయన్ పి.హరికిషన్ రెడ్డి, జోన్ చైర్మన్ ఎ.మధు, జి.సంపత్, వి.తిరుమల శ్రీనివాస్, ఉపేందర్ అభినందించారు.


ప్రతి బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డు ఉండాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చోరీలు జరుగకుండా అన్ని బ్యాంకుల్లో సెక్యూరిటీ గార్డులను నియమించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సూచించారు. బుధవారం సీఐ కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల బ్యాంకు మేనేజర్లు, ఎస్సైలతో ఏసీపీ నర్సయ్య సమావేశం నిర్వహించారు. ఏది ఏమైన బ్యాంకులో సెక్యూరిటీ గార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, సృజన్‌కుమార్, శ్రావన్‌కుమార్ ఉన్నారు.

ఆత్మవిశ్వాసం విజయానికి తొలిమెట్టు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ఆత్మవిశ్వాసం దృఢంగా ఉంటే విజయం వారి సొంతమవుతుందని ప్రముఖ మోటివేటర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 9,10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక విద్యా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పలు సూక్తులను ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, కన్న పరశురాములు, భాస్కర్‌రెడ్డి, చందుపట్ల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు


దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

పాలకుర్తి, ఫ్రిబవరి 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుబ్బతండా (ఎస్) గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచు భూక్య యాకూబ్, మాజీ వార్డు సభ్యులు భూక్య యాదగిరి, భాస్కర్, అనిల్, వెంకటి, రవి, బాలుతో పాటు మరో 30 మంది కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఇప్పుడు ఆ హామీలు అమలు చేద్దామంటే సాధ్యం కావడం లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి పుస్కూరి శ్రీనివాసరావు, రాజేంద్రచారి, వేణు ఉన్నారు.


రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలి

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకొని ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంజేపీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జడ్జి సి.విక్రమ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు హక్కులను పరిరక్షిస్తూ ఉంటుందన్నారు. మగవారి వివాహ వయస్సు 21, ఆడవారికి 18 ఏళ్లు అని చట్టాలు రూపొందించారన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.చంద్రమౌళి, ఎం.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరిని విమర్శించే స్థాయి రాజయ్యకు లేదు

-జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి, :ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే స్థాయి రాజయ్యకు లేదని.. ఖబర్దార్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మారజోడు రాంబాబుతో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ టికెట్ పొందని రాజయ్య, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే కాంగ్రెస్‌లో చేరడానికి విశ్వ ప్రయత్నం చేసి కాంగ్రెస్ అధిష్టానం తిరస్కరణకు గురై చివరకు బీఆర్ఎస్‌లో చేరడాని ఎద్దేవ చేశారు. దేశంలోనే బర్తరఫ్ అయిన తొలి ఉప ముఖ్యమంత్రి రాజయ్యనే అన్న విషయాన్ని గుర్తు చేశారు. దళితుడైన రాజయ్య దళితుల నుండే దళిత బంధు పథకం కోసం ఒక్కొక్కరి వద్ద రూ2 లక్షలు తీసుకున్న దుర్మార్గుడని విమర్శించారు. ఎమ్మెల్యేగా పదవి బాధ్యతలు చేపట్టిన 14 నెలల వ్యవధిలోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు తెచ్చిన కడియంను విమర్శిస్తే..తస్మాత్ జాగ్రత్త అని రాజయ్యను హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్‌పల్లి లింగాజీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్, మేకల నరేందర్, బాషుమియా, లోనే శ్రావణ్ కుమార్, కావటి భాస్కర్, చెంచు రమేష్, భీరు మధు, తాటికొండ వెంకటేష్ యాదవ్, రంగు రాజు, ఇబ్రహీం పాష, కడారి రవి, తోటకూరి రమేష్, బంద కుమార్, మహేందర్, వెంకటేష్ యాదవ్, కిరణ్, భరత్, హరీష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు